సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
గురువారం | 9 | నవంబర్ | 2023



బొమ్మలకు జీవం.. అద్భుత ప్రావీణ్యం

కొబ్బరి పీచుతో ఆకర్షణీయమైన బొమ్మలు తయారు చేస్తూ మహిళలు ప్రతిభ కనబరుస్తున్నారు. కోనసీమలో కుటీర పరిశ్రమగా చేసుకుని జీవనోపాధి పొందుతున్నారు.

II లో



బ్రహ్మోత్సవం.. కనుల వైభవం

వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు కనుల వైకుంఠంగా సాగుతున్నాయి. రాష్ట్రం నలుమూలల నుంచి జనం పోటెత్తుతున్నారు.

II లో

5,500 క్యూసెక్కులు విడుదల



ధవళేశ్వరం: డెల్టా కాలువలకు బుధవారం 5,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పుడెల్టాకు వెయ్యి, మధ్య డెల్టాకు 1,500, పశ్చిమడెల్టాకు 3,000 క్యూసెక్కుల నీటిని వదిలారు. కాటన్ బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

నేడు జిల్లాస్థాయి బాలల సైన్స్ కాంగ్రెస్

అమలాపురం రూరల్: విద్యాశాఖ ఆధ్వర్యంలో గురువారం జిల్లా స్థాయి నేషనల్ సైన్స్ కాంగ్రెస్ పోటీలు జరుగుతాయని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.కమల కుమారి తెలిపారు. ఆమె బుధవారం మాట్లాడుతూ జిల్లా విద్యాశాఖ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి, సమనస ఢిల్లీ పబ్లిక్ స్కూల్ సంయుక్తంగా వీటిని నిర్వహిస్తున్నాయన్నారు. ముఖ్య అతిథిగా కోనసీమకు చెందిన మాజీ శాస్త్రవేత్త, విశ్వవిద్యాలయాల్లో అధ్యాపకులుగా పనిచేస్తున్న కేఎస్ఎన్ రావు హాజరవుతారన్నారు. జిల్లా సైన్స్ అధికారి జీవీవీ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ 10 ఏళ్ల నుంచి 17 ఏళ్ల విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులు ప్రదర్శిస్తామన్నారు. పాఠశాలల నుంచి ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న 215 ప్రాజెక్టుల నుంచి 105 ప్రాజెక్టులను ఎంపిక చేసినట్టు తెలిపారు. వాటిని న్యాయనిర్ణేతల ముందు విద్యార్థులు, గైడ్ టీచర్ సహాయంతో వివరిస్తారన్నారు. కార్యక్రమానికి హాజరయ్యేవారు గురువారం ఉదయం 9 గంటల లోపు సమనసలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ప్రాంగణానికి తరలిరావాలన్నారు.

రాష్ట్ర ఉత్తమ ఉర్దూ టీచర్‌గా అలీబేగ్



మామిడికుదురు: నగరం గ్రామానికి చెందిన మహమ్మద్ అలీబేగ్ రాష్ట్ర ఉత్తమ ఉర్దూ టీచర్‌గా ఎంపికయ్యారు. ఈ మేరకు ఆయనకు బుధవారం రాష్ట్ర ఉర్దూ అకాడమీ నుంచి సమాచారం వచ్చింది. అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని విజయవాడలో ఈ నెల 11న నిర్వహించే జాతీయ విద్యా దినోత్సవ సభలో అలీబేగ్‌కు ఈ అవార్డును అందజేస్తారు. ఆయన ప్రస్తుతం కొత్తపేట మండలం కమ్మిరెడ్డి పాలెం ఎంపీపీ స్కూల్ టీచర్‌గా పని చేస్తున్నారు. 1994–95లో అలీబేగ్ ఉత్తమ విద్యార్థిగా, 2023లో కొత్తపేట నియోజకవర్గ స్థాయి ఉత్తమ టీచర్‌గా అవార్డులు అందుకున్నారు. ఉత్తమ ఉర్దూ టీచర్ అవార్డుకు ఎంపికైన అలీబేగ్‌ను పలువురు అభినందించారు.

ఓటరు జాబితా రూపకల్పనకు సహకరించాలి

అమలాపురం రూరల్: సార్వత్రిక ఎన్నికలు స్వేచ్ఛగా, ప్రశాంతంగా నిర్వహించడానికి సక్రమమైన ఓటరు జాబితా ఎంతైనా అవసరమని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్ అజయ్ అన్నారు. కలెక్టరేట్‌లో ఆమె చాంబర్‌లో బుధవారం జిల్లా స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి, ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియ, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ప్రాథమిక స్థాయి తనిఖీలో పురోగతిని వివరించారు. జేసీ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం సూచనలకు అనుగుణంగా ఓటరు జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ ప్రక్రియలో అన్ని రాజకీయ పార్టీ తమ సహకారాన్ని అందించాలన్నారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు కామన ప్రభాకర్ రావు మాట్లాడుతూ ఈ నెల 4, 5 తేదీల్లో నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాల్లో బూత్ స్థాయి అధికారులు సక్రమంగా విధులకు హాజరు కాక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. డిసెంబర్ 2, 3 తేదీల్లో నిర్వహించే ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాలకు అధికార యంత్రాంగం పటిష్టమైన చర్యలు చేపట్టాలని కోరారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు దూరి రాజేష్ మాట్లాడుతూ ఓటరు జాబితాలో ఓట్లు తొలగింపునకు సంబంధించి బీఎల్‌ఓలు ఆన్‌లైన్‌లో సాంకేతిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ అంశంపై వారికి శిక్షణ ఇప్పించాలని కోరారు.

తలుపు తట్టి.. మేలును తెలిపి..



- నేటి నుంచి వై ఏపీ నీడ్స్ జగన్
- సంక్షేమం, అభివృద్ధిపై ప్రజలకు అవగాహన
- ఈ నెల 23 వరకూ కార్యక్రమం
- జిల్లాలో 256 చోట్ల నిర్వహణకు ప్రణాళిక
- వలంటీర్ల నుంచి కలెక్టర్ వరకూ పర్యవేక్షణ

నియోజకవర్గాల వారీగా నిర్వహించే కార్యక్రమాలు

కొత్తపేట	40
అమలాపురం	40
పి.గన్నవరం	32
రాజోలు	42
రామచంద్రపురం	29
ముమ్మిడివరం	34
మండపేట	39

సాక్షి అమలాపురం: ఒకవైపు సంక్షేమం.. మరోవైపు అభివృద్ధి.. పరిపాలనా వికేంద్రీకరణతో అట్టడుగు వర్గాల వారికి జరుగుతున్న మేలు.. డీబీటీ ద్వారా అవినీతికి తావులేకుండా సొమ్ములను నేరుగా లబ్ధిదారుల ఖాతాలో జమ చేయడం.. ఇలా చెప్పుకుంటూ పోతే అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వైఎస్సార్ సీపీ అమలు చేస్తున్న పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల వల్ల సామాన్యులు, పేదలు, మధ్య తరగతి వారికి ఎన్నో ప్రయోజనాలు కలుగుతున్నాయి. వీటిని లబ్ధిదారులకు, ప్రజలకు వివరించడం, అవగాహన కల్పించడం, చేసిన మేలు చెప్పడం, చేసే మంచి వివరించేందుకు ప్రభుత్వం 'వై ఏపీ నీడ్స్ జగన్'కు శ్రీకారం చుట్టింది. జిల్లాలో ఈ కార్యక్రమం గురువారం నుంచి ప్రారంభం కానుంది.

ప్రతి రోజూ ఒక సచివాలయంలో..

వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ పథకాల లబ్ధి, సంక్షేమ లబ్ధి, అభివృద్ధి అంశాలను వివరించనున్నారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో గ్రామ సచివాలయం వ్యవస్థ, విలేజ్ హెల్త్ క్లినిక్, రైతు భరోసా కేంద్రాలు, ఫ్యామిలీ డాక్టర్ విధానం, వివక్షతకు లంచాలకు తావు లేకుండా ప్రభుత్వ పథకాలు అమలు తీరు, మనబడి – నాడు నేడు, వైద్య ఆరోగ్య సేవలలో పురోగతి, సామాజిక తనిఖీలు, దిశ యాప్ వంటి వాటిని కూడా వివరించనున్నారు. ప్రజలకు వివరించడంతో పాటు గ్రామ వార్డు సచివాలయాలలో పథకాల మూలంగా లబ్ధి పొందిన వారి జాబితాలను ప్రదర్శించనున్నారు. మొత్తం జిల్లా వ్యాప్తంగా 256 సచివాలయాల పరిధిలో ఈ కార్యక్రమం జరిగేలా షెడ్యూలు రూపొందించారు. ప్రతి మండలంలో ప్రతి రోజూ ఒక సచివాలయంలో ఈ కార్యక్రమం జరిగేలా ఏర్పాటు చేశారు. అలాగే అర్బన్ ఏరియాలో కూడా ఒక సచివాలయంలో నిర్వహించనున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఈవో పంచాయతీ రాజ్, పట్టణ ప్రాంతాల్లో అడిషనల్ కమిషనర్ నోడల్ ఆఫీసర్‌గా ఉంటారు. ఇందులో గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది అందరూ పాల్గొంటారు. వీరితో పాటు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీ, మంత్రులు కూడా పాల్గొననున్నారు.

బుక్‌లెట్ రూపకల్పన

ప్రతి గ్రామ, వార్డు సచివాలయాల్లో వీటిని నిర్వహించనున్నారు. అమలాపురం, రామచంద్రపురం, మండపేట మున్సిపాలిటీలు, ముమ్మిడివరం నగర పంచాయతీ తోపాటు 22 మండలాల్లో సచివాలయాల వారీగా ఈ కార్యక్రమం జరగనుంది. ప్రభుత్వం చేపట్టిన మంచిని ప్రజలకు వివరించనున్నారు. సంక్షేమ పథకాల ద్వారా ప్రతి గ్రామం, పట్టణాల్లో ఎంత లబ్ధి చేకూరిందో లబ్ధిదారులకు, ప్రజలకు తెలియజేస్తారు. సంక్షేమ పథకాలకు అర్హులైన లబ్ధిదారులకు డీబీటీలో ఎంత మేలు జరిగింది. ఆ ప్రాంతంలో ఎంతమందికి ఎలా లబ్ధి జరిగింది అన్నదానిపై ప్రతి ఒక్కరికీ వివరించనున్నారు. ఇందుకోసం 24 పేజీలతో కూడిన బుక్‌లెట్‌ను రూపకల్పన చేశారు. జిల్లాలో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సర్వం సిద్ధం చేశారు. ఇందుకోసం జిల్లా, మండల పర్యవేక్షుల నియామకం జరిగింది. గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలోని వలంటీర్లకు భాగస్వామ్యం కల్పించారు. వారితో పాటు సచివాలయ సిబ్బంది కూడా పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో అర్హత ఉండి ఒకవేళ ఎవరికైనా సంక్షేమ లబ్ధి అందకపోతే వారికి అందించేలా అధికారులు చర్యలు తీసుకోనున్నారు.

పూర్తిస్థాయి అవగాహన

సంక్షేమ పథకాల లబ్ధితోపాటు ఆ గ్రామం, పట్టణాల పరిధిలోని పాఠశాలల్లో నాడు – నేడు ద్వారా వచ్చిన మార్పులు వివరించడంతోపాటు ఇంగ్లిషు మీడియం, స్కూళ్లలో 6వ తరగతి నుంచే ఐఎఫ్‌పీ ప్యానెల్స్, 8వ తరగతిలో ట్యాబ్‌ల పంపిణీ వరకూ మారుతున్న స్కూళ్ల వ్యవస్థను వివరించనున్నారు. వైద్య రంగంలో విలేజ్ క్లినిక్స్‌తో సహా గ్రామంలో వచ్చిన మార్పులు, ఆర్‌బీకే వ్యవస్థతో పాటు వ్యవసాయ రంగంలో వచ్చిన మార్పులు, ప్రతి ఎకరాకు ఈ – క్రాప్, సోషల్ ఆడిట్ ద్వారా నిజాయితీగా అందుతున్న సేవలు, దిశ యాప్ ద్వారా కలుగుతున్న ప్రయోజనాలను వివరించారు. సచివాలయ వ్యవస్థ, చిన్న జిల్లాల ఏర్పాటు ద్వారా ప్రభుత్వ పరిపాలనలో వచ్చిన విప్లవాత్మక మార్పులపై అవగాహన కల్పిస్తారు. ప్రభుత్వ పరిపాలనలో వచ్చిన మార్పులతో పాటు పథకాలను ఎలా సద్వినియోగం చేసుకోవాలో లబ్ధిదారులకు అవగాహన కల్పించనున్నారు. ప్రతి గ్రామ, వార్డు సచివాలయాల్లో కూడా పథకాలపై అవగాహనకు బోర్డులు ఏర్పాటు చేయనున్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం (జీజీఎంపీ) ద్వారా జరిగిన అభివృద్ధి, దాని వల్ల కలిగిన ప్రయోజనాలను వివరించనున్నారు.

ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి



జిల్లాలో గురువారం నుంచి జరిగే వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది ఇలా ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి. ఇందులో భాగంగా ప్రభుత్వ పథకాల లబ్ధి, సంక్షేమ లబ్ధి, అభివృద్ధి అంశాలను వివరిస్తూ ఇంటింటికి వెళ్లి తెలియజేస్తారు. గ్రామ, వార్డు స్థాయిలో జరుగుతున్న అభివృద్ధిని వివరిస్తారు.

– ఎస్.నుపూర్ అజయ్, జాయింట్ కలెక్టర్

చంద్రబాబు మోసాన్ని ప్రజలు ఎప్పుడో గుర్తించారు

మంత్రి వేణు



ద్రాక్షారామలో విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి వేణు

రామచంద్రపురం రూరల్: ప్రతిపక్ష నేత నారా చంద్రబాబు నాయుడి మోసపు నైజాన్ని రాష్ట్ర ప్రజలు ఏనాడో గుర్తించారని రాష్ట్ర బీసీ సంక్షేమం, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. ద్రాక్షారామలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తానని మహిళలను, పంట రుణాలు రద్దు చేస్తానని రైతులను, ఉద్యోగం లేదా నిరుద్యోగ భృతి ఇస్తానని యువతను ఆయన మోసం చేశారని, దానికి బదులుగానే వారందరూ చంద్రబాబును సీఎం పీఠం నుంచి దించేశారన్నారు. ఆయన పాలనలో చేసిన స్కామ్‌లు ఒక్కొక్కటీ బయటపడుతున్నా, నిస్సిగ్గుగా అబద్ధాలతో రాష్ట్ర ప్రజలను మరోసారి మోసం చేయాలని చూస్తున్నారన్నారు. కానీ నిజమైన సంక్షేమ పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'మన ప్రభుత్వంలో మేలు జరిగితేనే.. తిరిగి తనకు ఓటు వేయాలి' అని ప్రజలను ధైర్యంగా అడుగుతున్నారన్నారు. రాష్ట్రానికి వైఎస్ జగనే ఎందుకు కావాలి అనే అంశంపై గురువారం నుంచి పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, పార్టీ కన్వీనర్లు, గృహసారథులతో ప్రజల్లోకి వెళుతున్నామన్నారు. సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పండు గోవిందరాజు, వైస్ చైర్మన్ కాకతీయ రాజు, ఏపీఐడీసీ డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా విక్రయాలకు లైసెన్సు తప్పనిసరి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జేసీ నుపూర్ అజయ్

- నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు
- జాయింట్ కలెక్టర్ నుపూర్ హెచ్చరిక

అమలాపురం రూరల్: దీపావళి సందర్భంగా బాణసంచా విక్రయించే వ్యాపారులు తప్పనిసరిగా లైసెన్సు కలిగి ఉండాలని, లేకుండా చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్ అజయ్ హెచ్చరించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ నుంచి డివిజన్‌లోని 22 మండలాల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. బాణసంచా విక్రయాలు, అగ్ని ప్రమాదాలు జరగకుండా చేపట్టాల్సిన ముందస్తు జాగ్రత్త చర్యలు, అనుమతుల మంజూరు తదితర అంశాలపై సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ అనుమతులు లేకుండా బాణసంచా విక్రయాలు, నిల్వలు చేయరాదన్నారు. దుకాణాల వద్ద అగ్ని ప్రమాదాలకు తావులేకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. షాపుల ఏర్పాటు, ట్రాఫిక్‌కు, వాహనాల పార్కింగ్‌కు ఇబ్బందులు కలగకుండా చూడాల్సిన బాధ్యత సంబంధిత డివిజన్, మండల స్థాయి అధికార బృందాలపై ఉందన్నారు. నివాస ప్రాంతాల్లో కాకుండా బహిరంగ ప్రాంతాల్లో దుకాణాలు ఏర్పాటు చేయాలని, ఒకేచోట 50కి మించి ఉండకూడదన్నారు. షాపునకు షాపునకు మధ్య మూడు మీటర్ల దూరం పాటించాలన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు మాట్లాడుతూ రాత్రి 10 గంటల తర్వాత నివాసయోగ్యమైన ప్రాంతాల్లో బాణాసంచా కాల్చరాదన్నారు. ఎలక్ట్రికల్ వైర్ల కింద బాణసంచా దుకాణాలు నిర్వహించరాదన్నారు. అలాగే లంక భూముల పట్టాల పంపిణీ, ఈనాం భూములు, అసైన్ భూముల డేటా ఎంట్రీ, పెండింగ్ అంశాల పురోగతిపై తహసీల్దార్లతో జాయింట్ కలెక్టర్ సమీక్షించారు. సమావేశంలో జిల్లా అగ్నిమాపక విపత్తుల స్పందన అధికారి పార్థసారథి, వాణిజ్య పన్నుల శాఖ సీటీవో టి.ధర్మారావు, జిల్లా మేనేజర్ పౌర సరఫరాలశాఖ ఎస్. సుధా సాగర్, సాంఘిక సంక్షేమశాఖ సాధికారత అధికారి పి.జ్యోతిలక్ష్మీదేవి, జిల్లా పంచాయతీ అధికారి వి.కృష్ణకుమారి, జిల్లా విద్యాశాఖ అధికారి కమల కుమారి, వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ సహాయ సంచాలకులు కె.విశాలాక్షి పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా పవిత్రోత్సవాలు

- బాలబాలాజీ స్వామికి ప్రత్యేక పూజలు
- శ్రీపుష్పయాగంతో ముగిసిన వేడుకలు

మామిడికుదురు: లోక శాంతి, విశ్వ కల్యాణం కోరుతూ అప్పనపల్లి బాలబాలాజీ స్వామి సన్నిధిలో మూడు రోజులు అంగరంగ వైభవంగా నిర్వహించిన పవిత్రోత్సవాలు బుధవారం సంపూర్ణమయ్యాయి. మూడోరోజు స్వామికి పలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చతుస్థానార్చనలతో ఉత్సవాలను ప్రారంభించి శ్రీపుష్పయాగంతో ముగించారు. 108 కలశాలతో స్వామి, అమ్మవార్లకు అభిషేకం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు ఈ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం శ్రీవారి శాంతి కల్యాణ మహోత్సవం కనుల పండగలా నిర్వహించారు. శ్రీపుష్పయాగం, మహాదాశీర్వచనం, తీర్థ ప్రసాద గోష్ఠి, ఋత్విక్ సన్మానంతో ఉత్సవాలు ముగిశాయి. ఆలయ కార్యనిర్వహణాధికారి జి.శ్రీదేవి, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ఉప ప్రధాన అర్చక మద్దాలి తిరుమల శింగరాచార్యులు, ముఖ్య అర్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో పవిత్రోత్సవాలు జరుగుతున్నాయి. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు చిట్టాల సత్తిబాబు, కొమ్ముల సూరిబాబు, గూటం శ్రీను, బత్తుల విజయగంగారత్నం, బొరుసు పార్వతీ దుర్గాభవాని, ఆలయ ఉద్యోగులు, భక్తులు పాల్గొన్నారు.



బాల బాలాజీ స్వామికి అభిషేకం

పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే

బాలబాలాజీ స్వామి పవిత్రోత్సవాల్లో ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పాల్గొన్నారు. స్వామి, అమ్మవార్లకు ఆలయం తరఫున పట్టు వస్త్రాలను సమర్పించారు. ముందుగా స్వామిని దర్శించుకుని అర్చకుల ఆశీర్వచనం అందుకున్నారు. జెడ్పీటీసీ కశిరెడ్డి అంజిబాబు, మాజీ చైర్మన్ పిచ్చుక చిన్న, కుసుమ శ్రీధర్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

ఓరియంటేషన్ తరగతులు



మామిడికుదురులో మాట్లాడుతున్న డీఈవో కమల కుమారి

రాయవరం: స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులకు బుధవారం ఒక రోజు ఓరియంటేషన్ తరగతులు నిర్వహించారు. రామచంద్రపురంలోని రత్నంపేట మున్సిపల్ హైస్కూల్, అమలాపురం మండలంలో పేరూరు, మామిడికుదురు జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఇవి జరిగాయి. ప్రతి నెలా ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు ప్రాథమిక స్థాయిలో సబ్జెక్టు ఉపాధ్యాయులకు, అలాగే ఫిజికల్ డైరెక్టర్లకు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహిస్తున్నారు. అయితే ఈ నెల రాష్ట్ర విద్యాశాఖ వినూత్న నిర్ణయాన్ని తీసుకుంది. స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులకు ఒక రోజు ఓరియంటేషన్ తరగతిని నిర్వహించాలని నిర్ణయించింది. ఈ సమావేశాల్లో ఎంఈవో–1, ఎంఈవో–2లను కూడా భాగస్వాములను చేశారు. అందులో భాగంగా జిల్లాలో మూడు చోట్ల నిర్వహించిన డివిజనల్ స్థాయి స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంల సమావేశాల్లో 122 మంది పాల్గొన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ సెషన్ల వారీగా ఓరియంటేషన్ తరగతులు నిర్వహించారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ తరగతుల్లో వివిధ అంశాలపై చర్చించారు. సమావేశాల్లో పాల్గొన్న డీఈవో ఎం.కమల కుమారి, రామచంద్రపురం డీవైఈవో నరసింహఫణి, సెక్టోరియల్ అధికారులు బీవీవీ సుబ్రహ్మణ్యం, డి.రమేష్ బాబు, పి.రాంబాబు, మొయినుద్దీన్ తదితరులు ప్రధానోపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ముఖ్యంగా అకడమిక్ పరంగా ప్రధానోపాధ్యాయులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఇకపై ప్రతి నెలా 8వ తేదీన స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలకు డివిజనల్ స్థాయి సమావేశాలు నిర్వహిస్తామని, 8వ తేదీ పబ్లిక్ హాలీడే ఉంటే 11వ తేదీలోపు ఏదో ఒకరోజు సమావేశాలు నిర్వహించనున్నట్లు డీఈవో కమలకుమారి తెలిపారు.

లక్ష్యం దిశగా ఆపరేషన్ సురక్ష

- వైద్య శిబిరాల్లో రోగుల గుర్తింపు
- 2,130 మందిని శస్త్ర చికిత్సలకు సిఫారసు
- వైఎస్సార్ ఆరోగ్య శ్రీ ద్వారా ఉచితంగా నిర్వహణ
- ఏర్పాట్లు చేస్తున్న జిల్లా యంత్రాంగం



అమలాపురం మండలం కామనగరువులో వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్లు (ఫైల్)

సాక్షి అమలాపురం: రోగుల గుర్తింపునకు ఇంటింటా సర్వే.. గుర్తించిన రోగుల కోసం వైద్య శిబిరాల నిర్వహణ.. ఆపై నిపుణులైన వైద్యుల ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు.. ఉచితంగా మందులు అందజేత.. అవసరమైన వారికి శస్త్ర చికిత్సలకు సిఫారసు.. ఎంపికైన వారికి ఉచితంగా శస్త్ర చికిత్సలు. సామాన్యులు, పేదలు, మధ్యతరగతి వారి సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న వైద్య సురక్ష జిల్లాలో ఐదో దశ మొదలైంది. దీనిలో భాగంగా వివిధ రోగాలకు సంబంధించి ఎంపిక చేసిన వారికి ఉచితంగా శస్త్ర చికిత్సలు మొదలవుతున్నాయి.

జిల్లాలో 518 శిబిరాలు

వైఎస్సార్ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకూ 518 వైద్య శిబిరాలు నిర్వహించారు. అమలాపురం, మండపేట, రామచంద్రపురం మున్సిపాలిటీలు, ముమ్మిడివరం నగర పంచాయతీతో పాటు 22 మండలాల పరిధిలోని నెల రోజుల పాటు యజ్ఞంలా సాగింది. వీటి ద్వారా 1,87,863 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వారిలో 2,130 మందిని రిఫరల్ కేసులుగా నిర్ధారించి శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. జీజీహెచ్‌లో 181 మందికి, ఏరియా ఆస్పత్రులలో 981 మందికి, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు (సీహెచ్‌సీ)లలో 181 మందికి, డిస్ట్రిక్ట్ హాస్పటళ్లలో 74 మందికి, పీహెచ్‌సీలలో ఒకరికి, ప్రైవేట్ ఆస్పత్రులలో 712 మందికి శస్త్ర చికిత్సలు చేయాలని నిర్ణయించారు. ఇప్పటికే శస్త్ర చికిత్సలు చేయడం ఆరంభించారు. ఇప్పటి వరకు 97 మందికి శస్త్ర చికిత్సలు చేశారు.

47,537 మందికి కంటి పరీక్షలు

వైఎస్సార్ ఆరోగ్య సురక్ష శిబిరాల్లో 47,537 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో 13,293 మందికి సాధారణ మందులు ఇస్తే సరిపోతోందని గుర్తించి, వారికి ఉచితంగా మందులు అందజేశారు. 32,166 మందికి కళ్లద్దాలు వేయాలని సిఫార్సు చేయగా, వైఎస్సార్ కంటి వెలుగులో 1,991 మందిని క్యాటరాక్ట్ శస్త్ర చికిత్సలు చేయాలని నిర్ధారించారు. వీరిలో ఇప్పటికే 265 మందికి శస్త్ర చికిత్సలు పూర్తి చేశారు.

ఉచితంగా వైద్యసేవలు

ఆరోగ్య శిబిరాల్లో ఎంపిక చేసిన కేసులలో గుండె సంబంధిత వ్యాధులకు సంబంధించి 116, చెవి, ముక్కు, గొంతుకు 213, జనరల్ సర్జరీలు 724, జనరల్ మెడిసన్ 370, ఆర్థోపెడిక్ సర్జరీలు 198 వరకూ ఉన్నాయి. వీటితో పాటు గైనకాలజీ 92, న్యూరో సర్జరీ 48 మందికి శస్త్ర చికిత్సలు చేయాల్సి ఉంది. రిఫరల్ కేసులకు సంబంధించి ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులు, సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను డిసెంబర్ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని జిల్లా యంత్రాంగం లక్ష్యంగా పెట్టుకుంది. వైద్య శిబిరాలలో రిఫరల్ చేసిన కేసులను మ్యాపింగ్ చేశారు. వీరిని నెట్‌వర్క్ ఆసుపత్రులకు తరలించి ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా శస్త్ర వైద్య చికిత్సలు నిర్వహించనున్నారు. ఆరోగ్యశ్రీ పరిధిలోకి రాని కేసులకు సూపర్ స్పెషాలిటీ, జీజీహెచ్ వంటి ఆసుపత్రులలో ఉచితంగా వైద్యసేవలు అందిస్తున్నారు.

క్లుప్తంగా

రైలు నుంచి జారిపడి యువకుడి మృతి



తుని: స్థానిక జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో రైలు నుంచి జారిపడి గుర్తుతెలియని యువకుడు మృతి చెందాడని ఎస్సై ఎస్‌కే అబ్దుల్ మారూఫ్ తెలిపారు. బుధవారం అందిన సమాచారం మేరకు ఆయన సంఘటన స్థలాన్ని పరిశీలించారు. తుని – నర్సీపట్నం మధ్యలో విశాఖపట్నం వైపు వెళుతున్న రైలు నుంచి జారిపడి సుమారు 25 ఏళ్ల గుర్తు తెలియని యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. అతడి ఒంటిపై నలుపు రంగు జీన్ ప్యాంటు, సిమెంట్ రంగు చొక్కా ఉన్నాయి. మృతుడి వివరాలేమీ తెలియలేదని, ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

తల్లిదండ్రుల చెంతకు క్షేమంగా బాలుడు



రాజమహేంద్రవరంలో బాలుడితో పోలీసులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఇంటి నుంచి పారిపోయిన వచ్చిన ఓ బాలుడిని ప్రకాశం నగర్ పోలీసులు క్షేమంగా అతడి తల్లిదండ్రులకు అప్పగించారు. వివరాల్లోకి వెళితే.. ఈ నెల ఏడో తేదీ రాత్రి కానిస్టేబుల్ సీహెచ్ శేషు నైట్ బీట్ గస్తీలో భాగంగా విధులు నిర్వర్తిస్తున్నాడు. అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో ఆర్టీసీ కాంప్లెక్స్‌లో అయోమయంగా తిరుగుతున్న 15 ఏళ్ల బాలుడు కనిపించాడు. అనుమానంతో ఆ బాలుడిని ప్రశ్నించగా, తన పేరు దేవరకొండ సత్య విశ్వనాథ్ అని, తండ్రి వీరభద్రరావు అని తెలిపారు. జగ్గంపేట నియోజకవర్గంలోని గోకవరం తన స్వగ్రామమని, తల్లిదండ్రులకు చెప్పకుండా ఇంటి నుంచి పారిపోయి వచ్చానని చెప్పాడు. వెంటనే కానిస్టేబుల్ సీహెచ్ శేషు ఈ విషయాన్ని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.కృపానందానికి సమాచారం ఇచ్చారు. ఆ బాలుడిని ప్రకాశం నగర్ పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి, విషయాన్ని తల్లిదండ్రులకు తెలిపారు. అనంతరం వారికి బాలుడిని క్షేమంగా అప్పగించారు.

బొమ్మలకు జీవం.. అద్భుత ప్రావీణ్యం



అప్పనపల్లిలో పీచుతో బొమ్మలు తయారు చేస్తున్న మహిళలు



పీచుతో అందంగా రూపుదిద్దుకున్న బొమ్మలు



కొబ్బరి పీచుతో తయారు చేసిన దండ

- డొక్క పీచుతో అందమైన బొమ్మలు
- ప్రతిభ చూపుతున్న మహిళలు
- 400 మందికి శిక్షణ

మామిడికుదురు: కొబ్బరి పీచుతో ఆకర్షణీయమైన బొమ్మలు తయారు చేస్తూ మహిళలు ప్రతిభ కనబరుస్తున్నారు. కోనసీమలోని పలు గ్రామాల్లో బొమ్మల తయారీని కుటీర పరిశ్రమగా చేసుకుని జీవనోపాధి పొందుతున్నారు. కోనసీమలోని అప్పనపల్లి, బి.దొడ్డవరం, లూటుకుర్రు, పెదపట్నం, పెదపట్నంలంక, పాశర్లపూడి, ఈదరాడ, జనుపల్లి గ్రామాల్లో కొబ్బరి పీచుతో బొమ్మల తయారీపై పలువురు మహిళలు శిక్షణ పొందారు. బొమ్మల తయారీలో వారికి రాజమహేంద్రవరం క్వాయర్ బోర్డుతో పాటు నాబార్డు బాసటగా నిలుస్తోంది. పాశర్లపూడికి చెందిన ఆక్సిజన్ అసోసియేషన్ నిర్వాహకుడు కటికిరెడ్డి గంగాధర్ ఈ శిక్షణలో కీలక పాత్ర పోషిస్తున్నారు. కొబ్బరి పీచుతో బొమ్మల తయారీతో పాటు ఇతర ఉప ఉత్పత్తుల తయారీపై 400 మంది మహిళలు శిక్షణ పొందారు. వీరు కొబ్బరి పీచుతో ఏనుగులు, తాబేళ్లు, జిరాఫీలు, లేడి, నెమలి, గుర్రం, ఒంటె, పిచ్చుక గూళ్లు, గృహాలంకరణ వస్తువులు తయారు చేస్తూ పలువురి ప్రశంసలందుకుంటున్నారు. మహిళలు తయారు చేస్తున్న బొమ్మలను రాష్ట్రంలోని ప్రముఖ పట్టణాల్లో క్వాయర్ బోర్డు ఆధ్వర్యాన ఎగ్జిబిషన్లలో ప్రదర్శించి, విక్రయిస్తున్నారు.

తయారీపై శిక్షణ పొందాం



మా గ్రామం నుంచి చాలా మంది మహిళలు డొక్క పీచుతో బొమ్మల తయారీపై శిక్షణ పొందారు. కోనసీమలో సులభంగా లభ్యమయ్యే డొక్క పీచుతో ఎన్నో అద్భుతమైన బొమ్మలు తయారు చేయవచ్చు. వీటితో పాటు కొబ్బరి ఉప ఉత్పత్తుల తయారీకి కూడా ఆస్కారం ఉంది. క్వాయర్ బోర్డు సహకారం అందిస్తే దీనిని కుటీర పరిశ్రమగా మరింతగా విస్తరిస్తాం.

– వానరాశి సరస్వతి, మామిడికుదురు

జీవనోపాధి



కొబ్బరి పీచుతో బొమ్మలు తయారు చేయడం చాలా సులభం. బొమ్మల తయారీపై క్వాయర్ బోర్డు ఇచ్చిన శిక్షణలో మహిళలు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. పీచుతో ఎంతో అందంగా ఉండే బొమ్మలు రూపుదిద్దుకుంటున్నాయి. బొమ్మల తయారీని ప్రతి గ్రామానికీ విస్తరిస్తే మహిళలకు మరింత జీవనోపాధి కలుగుతుంది. ఈ దిశగా క్వాయర్ బోర్డు కార్యాచరణ చేపట్టాలి.

– కాకి వెంకటనాగలక్ష్మి, బి.దొడ్డవరం

మార్కెటింగ్ సదుపాయం కల్పించాలి



కొబ్బరి పీచుతో బొమ్మలు తయారు చేయడంలో ఎంతో మంది మహిళలు శిక్షణ పొందారు. కానీ మేం తయారు చేస్తున్న బొమ్మలకు మార్కెటింగ్ సదుపాయం పెద్ద సమస్యగా మారింది. క్వాయర్ బోర్డుతో పాటు ప్రభుత్వం కూడా మార్కెటింగ్ సదుపాయం కల్పించే దిశగా చర్యలు చేపట్టాలి. దీనివల్ల మహిళలకు మేలు జరుగుతుంది. మరింత మంది బొమ్మల తయారీకి ముందుకు వస్తారు.

– పెద్దిరెడ్డి సురేఖ, అప్పనపల్లి

నేటి నుంచి సౌత్ జోన్ కబడ్డీ టోర్నీ



సతీష్ రెడ్డి

గండేపల్లి: కాకినాడ జిల్లా గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య కళాశాలలో సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ కబడ్డీ (పురుషులు) టోర్నమెంట్ గురువారం నుంచి ఐదు రోజుల పాటు జరగనుంది. ఈ టోర్నీని రాష్ట్ర మంత్రి ఆర్‌కే రోజా ప్రారంభిస్తారని ఆదిత్య కళాశాల వైస్ చైర్మన్ నల్లమిల్లి సతీష్ రెడ్డి చెప్పారు. ఆయన బుధవారం గండేపల్లిలో విలేకరులతో మాట్లాడుతూ ఆరు రాష్ట్రాల పరిధిలోని 113 వర్సిటీల నుంచి 1,200 మంది క్రీడాకారులు హాజరవుతున్నారన్నారు. ప్రారంభోత్సవానికి స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి, ఏపీ ఉన్నత మండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి, నన్నయ వర్సిటీ వీసీ కె.పద్మరాజు తదితరులు హాజరవుతారన్నారు.

కొట్లాట కేసులో ఇరువర్గాలకు జరిమానా

పెదపూడి: కొట్లాట కేసులో ఇరువర్గాలకు జరిమానా విధిస్తూ కోర్టు తీర్పునిచ్చింది. ఎస్సై రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. కరకుదురులో 2018 సంవత్సరంలో ఎం.బ్రహ్మాజీ, వైఎస్ రావు వర్గాల మధ్య కొట్లాట జరిగింది. దీనిపై విచారణ అనంతరం బుధవారం కాకినాడలోని పీజేసీఐ కమ్ జేఎఫ్‌సీఎం మేజిస్ట్రేట్ వీఎల్ఎస్.సుందరి తీర్పునిచ్చారు. బ్రహ్మాజీ వర్గానికి రూ.10 వేలు, వైఎస్‌రావు వర్గానికి రూ.15 వేల జరిమానా విధించారు.

ఉత్సాహంగా సైక్లింగ్ క్రీడాకారుల ఎంపికలు



ఎంపికల్లో పాల్గొన్న క్రీడాకారులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య అండర్ -14, 17 ఆధ్వర్యంలో బుధవారం కాకినాడలో సైక్లింగ్ క్రీడాకారుల ఎంపికలు ఉత్సాహంగా జరిగాయి. వీటిని పాఠశాల క్రీడా సమాఖ్య ప్రధాన కార్యదర్శి ప్రసాద్ ప్రారంభించారు. 60 మంది రెండు విభాగాల్లో హాజరు కాగా, 32 మందిని రాష్ట్రస్థాయి పోటీలకు నిర్వాహకులు ఎంపిక చేశారు. బాపట్ల జిల్లాలో ఈ నెల 11, 12 తేదీలలో జరిగే అంతర్ జిల్లాల సైక్లింగ్ పోటీలలో జిల్లా తరఫున వీరు పాల్గొంటారని ప్రసాద్ తెలిపారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులు ఈనెల 10వ తేదీ ఉదయం 10 గంటలకు కాకినాడ పీఆర్ ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల ఆవరణలోని ఎస్‌జీఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో సంప్రదించాలనికోరారు. సైక్లింగ్ ఎంపికల్లో 12 మంది వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొని సహకారం అందించారు.

11న టెన్నిస్ క్రీడాకారుల ఎంపికలు

జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య అండర్–14, 17 ఆధ్వర్యంలో ఈ నెల 11న టెన్నిస్ క్రీడాకారుల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు సమాఖ్య కార్యదర్శి ప్రసాద్ బుధవారం తెలిపారు. కాకినాడ గుడారిగుంట డీమార్ట్ సమీపంలోని మున్సిపల్ టెన్నిస్ కోర్టులో ఈ ఎంపికలు జరుగుతాయన్నారు. ఆసక్తి గలవారు ఆరోజు ఉదయం 9 గంటలకు వేదిక వద్దకు రావాలన్నారు. మరిన్ని వివరాలకు 94908 96851 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఘనంగా బాలల సైన్స్ కాంగ్రెస్ పోటీలు

- రాష్ట్ర స్థాయికి ఏడు ప్రాజెక్టులు
- ఈ నెల 29, 30 తేదీల్లో గుంటూరులో నిర్వహణ



విజేతలతో డీవైఈవో నారాయణ తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: ఏపీ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఆప్ కాస్ట్) ఆధ్వర్యంలో స్థానిక కవలగొయ్యి రోడ్డులోని ది ఫ్యూచర్ కిడ్స్ స్కూల్లో బుధవారం 31వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ జిల్లా స్థాయి పోటీలు ఘనంగా నిర్వహించారు. వీటిని రాజమహేంద్రవరం డివిజన్ ఉప విద్యాశాఖాధికారి ఈవీబీఎస్ నారాయణ, అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్, రూరల్ ఎంఈవో తులసీదాస్ ప్రారంభించారు. డీవైఈవో మాట్లాడుతూ దేశంలో శాస్త్ర, విజ్ఞాన, సాంకేతిక రంగాల్లోని పరిశోధనలను ప్రోత్సహించాలన్నదే నేషనల్ చిల్డ్రన్స్ సైన్స్ కాంగ్రెస్ ముఖ్య ఉద్దేశమన్నారు. న్యాయనిర్ణేతలుగా వెంకటేశ్వర్లు, కిరణ్ కుమార్, శ్రీనివాస్, దుర్గారావు, మల్లికార్జున, హరినాథ్ రెడ్డి, ఎం.రాజీవ్ వ్యవహరించారు.

రాష్ట్ర స్థాయికి ఏడు ప్రాజెక్టులు

రాజమహేంద్రవరంలోని ఎస్‌కేవీటీ ఉన్నత పాఠశాల, శ్రీగౌతమీ పాఠశాల, కవలగొయ్యి రోడ్డులోని ది ఫ్యూచర్ కిడ్స్ స్కూలు, రంగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సీతానగరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మద్దూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, లక్ష్మీపురం మండల ప్రజా పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన ఏడు ప్రాజెక్టులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాయి. గుంటూరులో జరిగే ఈ నెల 29, 30వ తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి సైన్స్ కాంగ్రెస్ పోటీల్లో ఆ విద్యార్థులు పాల్గొంటారని జిల్లా ఆప్ కాస్ట్ జిల్లా కో ఆర్డినేటర్ కన్నూరి సతీష్ బాబు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ఎస్ నెహ్రూ, అకడమిక్ కోఆర్డినేటర్ మేకా సుసత్య రేఖ, రిసోర్స్ పర్సన్స్ ఆనంద్ బాబు, సుబ్బయ్య, ఆంజనేయులు, ది ఫ్యూచర్ కిడ్స్ స్కూల్ డైరెక్టర్ యేలేటి రవిబాబు, చైర్‌పర్సన్ యేలేటి విజయ, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కుడిపూడి పార్థసారధి పాల్గొన్నారు.

గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి



రామారావు మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, ఏపీఓ రాజామణి

ఉప్పలగుప్తం: మండలంలోని చల్లపల్లి గ్రామానికి చెందిన కుంపట్ల రామారావు (56) ఉపాధి పనులు చేస్తుండగా గుండెపోటుతో బుధవారం మృతి చెందాడు. ఏపీఓ రాజామణి తెలిపిన వివరాల ప్రకారం.. చాకలిపాలెం కాలువలో తూటు తొలగిస్తుండగా ఉదయం 11 గంటలకు రామారావుకు గుండెపోటు వచ్చింది. కాలువలో నుంచి గట్టు పైకి వచ్చి అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందాడు. ఈ ఘటనపై ఉపాధి కూలీలు ఏపీఓ రాజామణికి సమాచారం అందించడంతో ఎంపీడీఓ కె.వెంకటేశ్వర ప్రసాద్‌తో కలసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడికి భార్య, ఐదుగురు కుమార్తెలు ఉన్నారు.

బ్రహ్మోత్సవం.. కనుల వైభవం

- వాడపల్లి వెంకన్నకు ప్రత్యేక పూజలు
- గజవాహనంపై స్వామివారి దర్శనం



స్వామి వారికి అభిషేకం చేస్తున్న పండితులు



రాజాధిరాజ అలంకరణలో గజవాహనంపై స్వామి వారు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతి కెక్కిన వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు రాష్ట్రం నలుమూల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారికి వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రాజాధిరాజ అలంకరణలో గజవాహనంపై ఊరేగించారు. ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఆలయ ఈవో ముదునూరి సత్యనారాయణరాజు దంపతులు స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఖండవల్లి రాజేశ్వర వర ప్రసాదాచార్యులు ఆధ్వర్యంలో వేద పండితులు, అర్చకులు పూజలు, సేవలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్ రాజు, ఆలయ ఈవో ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు, ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు. ఎస్సై బీవై కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

నేటి కార్యక్రమాలు

గురువారం ఉదయం స్వామివారికి విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, తిరుప్పావడ సేవ, చూర్ణోత్సవం, ప్రధాన హోమాలు నిర్వహిస్తారు. సాయంత్రం స్వస్తి వచనం, ప్రధాన హోమాలు, దిగ్దేవతా బలిహరణ, నీరాజనం, కల్కి అలంకరణతో అశ్వవాహన సేవ తదితర పూజా కార్యక్రమాలు జరుపుతారు.

విద్యార్థిపై ఉపాధ్యాయుడి దాష్టీకం

నిడదవోలు: పట్టణంలోని సెయింట్ ఆన్స్ హైస్కూల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థి వీరమల్ల మనోజ్ కుమార్‌ను ఉపాధ్యాయుడు వసంత్ కుమార్ కర్రతో కొట్టడంతో ఎడమ కన్ను దెబ్బతింది. తోటి విద్యార్థులు అతడిని పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి, అనంతరం లయన్స్ కంటి ఆసుపత్రికి తీసుకువెళ్లారు. మనోజ్ కుమార్‌కు వైద్యులు కంటి పరీక్షలు చేశారు. కంటి నుంచి రక్తం కారి గడ్డకట్టడంతో విశాఖపట్నంలోని ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి రిఫర్ చేశారు. ఇంత జరిగినా స్కూల్ యాజమాన్యం మాత్రం మనోజ్ కుమార్‌ను పట్టించుకోలేదు. విద్యార్థి తండ్రి ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.